సాక్షి
సిద్దిపేట

శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023


చింతమడక ప్రభుత్వ పాఠశాలలో ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు


చింతమడకలో ఓటర్లకు నమస్కారం చేస్తున్న సీఎం కేసీఆర్

ఓటెత్తారు

గంట గంటకూ పెరిగిన పోలింగ్
- రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- జిల్లాలో ప్రశాంతం
- పలు చోట్ల ఈవీఎంల మొరాయింపు
- కంట్రోల్ యూనిట్‌లలో ఓటరు తీర్పు

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర అసెంబ్లీ సాధారణ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. నాలుగు నియోజకవర్గాల్లోని 1,151 పోలింగ్ కేంద్రాలలో 9,48,664 ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5 గంటల వరకు 77.44శాతం పోలింగ్ జరిగినట్లు తెలుస్తోంది. రాత్రి పొద్దుపోయే వరకు పోలింగ్ జరగడంతో ఇంకా పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7గంటలకు ప్రారంభమై పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. గంట గంటకు పోలింగ్ పెరుగుతూ వచ్చింది. అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎం, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లను పోలింగ్ సిబ్బంది సిద్దిపేటలో ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూంకు తరలించారు.

ఓటర్లు ఒకే సారి రావడంతో..

పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు ఓటింగ్ జరిగింది. సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాలో ఎన్నికలు ముగిసే సమయానికి ఓటర్లు ఒకేసారి వచ్చారు. సాయంత్రం 5గంటల వరకు కేంద్రం లోపలికి వచ్చిన వారికి ఓటువేసే అవకాశం కల్పించారు.

పలు చోట్ల ఈవీఎంల మొరాయింపు

జిల్లాలో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. చిన్నకోడూరు మండల కేంద్రంలోని 208 నంబర్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో సుమారు గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. గంగాపూర్‌లో 198 కేంద్రంలో రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. హుస్నాబాద్ పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఈవీఎం కొద్దిసేపు పనిచేయలేదు. సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రంలో 15 నిమిషాల పాటు ఈవీఎం పనిచేయలేదు. గజ్వేల్ మండలం గిరిపల్లి, లక్ష్మాపూర్‌లో ఈవీఎంలు మొరాయించాయి. జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో 10 నిమిషాలు విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

పటిష్ట బందోబస్తు

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లాలో 10 డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాలలోని పోలీసులు, స్థానిక పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు, రైల్వే పోలీస్ అధికారులు, సిబ్బంది మొత్తం 2,632 మందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

నియోజకవర్గం	పోలింగ్‌కేంద్రాలు	మొత్తం ఓటర్లు
హుస్నాబాద్	304	2,42,177
సిద్దిపేట	273	2,33,733
దుబ్బాక	253	1,98,100
గజ్వేల్	321	2,74,654


జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ దంపతులు

పోలింగ్ సరళి (శాతంలో)..

నియోజకవర్గం	9గంటలు	11గంటలు	1గంట	3గంటలు	5గంటలు
హుస్నాబాద్	12.67	26.98	42.73	63.65	77.81
సిద్దిపేట	11.50	32	44.85	64.52	73.03
దుబ్బాక	10.03	29.12	48.27	70.48	82.75
గజ్వేల్	11.03	24.98	42.54	62.35	76.17


పోలింగ్ కేంద్రం వద్ద తమ బంధువులతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ సతీమణి శోభ

కంట్రోల్ యూనిట్‌లలో భవితవ్యం

నాలుగు నియోజకవర్గాలలో 95 మంది బరిలో ఉన్నారు. హుస్నాబాద్- 19, సిద్దిపేట -21, దుబ్బాక -11, గజ్వేల్- 44 మంది ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేశారు. ఈవీఎంలలో ఆయా నియోజకవర్గాల నుంచి బరిలో ఉన్న అభ్యర్థుల ఓటరు తీర్పు పెట్టెల్లో నిక్షిప్తమై ఉంది. నాలుగు నియోజకవర్గాల నుంచి ఈవీఎంలను పోలింగ్ సిబ్బంది సిద్దిపేటలోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో అప్పగించారు. స్ట్రాంగ్ రూంలో ఈవీఎం, కంట్రోల్ యూనిట్‌లను భద్రపరిచారు.

ఓటు వేసిన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పూజల హరికృష్ణ స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో తన సతీమణి శైలజతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి స్థానిక విద్యాభారతి పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వర్గల్‌లో నర్సారెడ్డి..

వర్గల్(గజ్వేల్): గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి గురువారం తన ఓటుహక్కును సొంత గ్రామం వర్గల్‌లో వినియోగించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి వచ్చి ఓటేశారు.


సిద్దిపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరీశ్‌రావు దంపతులు


కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ దంపతులు


ఓటేసిన బీజేపీ అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి


దుబ్బాకలో ఓటేసిన కొత్త కుటుంబం


ఓటేసిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి


బీజేపీ అభ్యర్థి రఘునందన్

న్యూస్‌రీల్

ఓటేసిన 104 ఏళ్ల వృద్ధురాలు


ఓటు వేసిన జోహారా బీ

సిద్దిపేటజోన్ : ఆమె వయస్సు సెంచరీ దాటింది. గురువారం ఎంతో సంతోషంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను చాటారు. సిద్దిపేట పట్టణానికి చెందిన 104 ఏళ్ల జోహారా బీ అనే వృద్ధురాలు స్థానిక ఉర్దూ మీడియం పాఠశాలలోని 127 పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.

పెళ్లి పందిరి నుంచి పోలింగ్ కేంద్రానికి..


కొమురవెల్లి(సిద్దిపేట): నూతన వధూవరులు ఓటేశారు. కొమురవెల్లి మండలం కిష్టంపేటలో పెళ్లి పందిరి నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చారు. వధూవరులు తడుపునూరి వివేక్, భావన కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సంగుపల్లిలో మహిళల నిరసన

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో పలువురు మహిళా ఓటర్లు థమ్స్‌అప్ బాటిళ్లను రోడ్డుపై పారబోసి నిరసన తెలిపిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సంగుపల్లికి చెందిన పలువురు యువకులు అభివృద్ధి, ఉద్యోగాలు తదితర అంశాలపై ప్రశ్నించడంతో ఓ పార్టీకి చెందిన నాయకులు థమ్స్‌అప్ బాటిళ్లను పంపిణీ చేశారని, తమకు ఇవి ఎందుకంటూ బాధిత మహిళలు వాటిని రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము సదరు రాజకీయ పార్టీకి చెందిన వారం కాకపోవడం వల్లే థమ్స్‌అప్ బాటిళ్లను పంపిణీ చేశారని మండిపడ్డారు.

77 మంది హిజ్రాలు ఓటు


సిరా గుర్తు చూపుతున్న హిజ్రాలు

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 77 మంది హిజ్రాలు ఉన్నారు. వీరు అమీన్‌పూర్ పరిధిలో నివాసం ఉంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో గురువారం జరిగిన పోలింగ్‌లో 77 మంది హిజ్రాలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకున్నప్పుడే దేశం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందని వారు పేర్కొన్నారు.

సునీతారెడ్డి కుమారుడి కారుపై దాడి


లింగంపల్లితండాలో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల పంచాయతీ లింగంపల్లితండాకు వెళ్లిన బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి కుమారుడు శశిధర్‌రెడ్డి కారుపై వెల్దుర్తి మండలం మహ్మద్‌నగర్ తండా గిరిజనులు దాడిచేశారు. దీంతో కారు ముందు అద్దం ధ్వంసమైంది. గురువారం శశిధర్‌రెడ్డి తన కారులో లింగంపల్లి పోలింగ్ బూత్‌కు వెళ్లి అక్కడి నుంచి తండాకు వెళ్లారు. మహ్మద్‌నగర్ తండాకు చెందిన యువకులు ఆయన కారుకు అడ్డుగా బైక్‌లను పెట్టి తండాకు డబ్బులు పంచేందుకు వచ్చారా అంటు శశిధర్‌రెడ్డితో గొడవకు దిగారు. అంతలోనే తండాకు చెందిన సంగ్యానాయక్ గనెట్ రాయితో కారుపై దాడిచేశాడు. శశిధర్‌రెడ్డి కొడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని కొడిపల్లి ఎస్‌ఐ, సీఐ పరిశీలించారు. దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు.

కాంగ్రెస్ గూండాలపనే..

సునీతారెడ్డి ప్రజాదరణ చూసి ఓర్వలేకనే తనపై కాంగ్రెస్ గూండాలు దాడిచేశారని శశిధర్‌రెడ్డి తెలిపారు. తండాలో పోలింగ్ కేంద్రం లేదని చెప్పడంతో వెనుకకు వస్తుండగా కాంగ్రెస్‌పార్టీకి చెందిన వ్యక్తులు ఉద్దేశ పూర్వకంగా దాడిచేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


వర్గల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటుహక్కు వినియోగించుకున్న గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి, కుటుంబసభ్యులు


ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కుటుంబం


హుస్నాబాద్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ దంపతులు


హుస్నాబాద్‌లో ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు నమస్కారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీశ్


ఈవీఎంలను స్ట్రాంగ్ రూంకు తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది


గజ్వేల్: అండ్‌ఆర్ కాలనీలో.. సమయం దాటినా క్యూలో ఉన్న ఓటర్లు


హుస్నాబాద్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు


సిద్దిపేట రూరల్: వృద్ధురాలిని తీసుకువస్తూ..

దుబ్బాకలో విజయం మాదే..

బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: పోలింగ్ సరళిని చూస్తుంటే తాను భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దుబ్బాక ప్రజలు బీఆర్‌ఎస్ కు అండగా నిలిచి ఓట్లు వేశారని అన్నారు. తనకు అండగా నిలిచి ఓట్లు వేసిన ఓటర్లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మనోహార్‌రావు, సోలిపేట సతీష్‌రెడ్డి, రొట్టె రాజమౌళి, కోమటిరెడ్డి వెంకట నర్సింహారెడ్డి, గుండెల్లి ఎల్లారెడ్డి, పల్లె వంశీకృష్ణాగౌడ్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

నేటి నుంచి నూతన మద్యం పాలసీ

- జిల్లాలో 93 దుకాణాల ద్వారా విక్రయాలు
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి

సిద్దిపేటకమాన్: జిల్లాలో 2023–25 సంవత్సరానికి డిసెంబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలవుతున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో 93 దుకాణాల ద్వారా విక్రయాలు జరగనున్నట్లు వారు తెలిపారు. సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, మిరుదొడ్డి సర్కిల్‌లో 93 మద్యం దుకాణాలున్నాయని తెలిపారు. 2021–23 మద్యం పాలసీ విధానం నవంబర్ 30న ముగియడం.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నూతన లైసెన్స్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల ముందుగానే నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులను ఆహ్వానించింది. డ్రా పద్ధతి ద్వారా దుకాణాలను కేటాయించినట్లు తెలిపారు. నూతన లైసెన్స్ దారులు వారికి కేటాయించిన దుకాణాల ద్వారా మద్యాన్ని విక్రయించుకోవచ్చని చెప్పారు.


సిద్ధమవుతున్న మద్యం దుకాణం

దుద్దెడలో కలెక్టర్, సీపీ..

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలం దుద్దెడలో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, పోలీస్ కమిషనర్ శ్వేత, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ స్టేషన్ల నిర్వహణ తీరును వారు పరిశీలించారు. కొండపాకలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక హైస్కూల్‌లో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని తయారు చేశారు. అందంగా తీర్చిదిద్దారు.

పోలీసు సిబ్బందికి అభినందనలు : పోలీస్ కమిషనర్ శ్వేత

సిద్దిపేటకమాన్: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిశాయని, విశేష కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించిన ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ నుంచి ఈవీఎం, వీవీ ప్యాట్‌లను సిద్దిపేట ఇందూరు ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూంకు తరలించి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


దుద్దెడలో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్


దుద్దెడలో.. పోలీస్ కమిషనర్ శ్వేత


ఓటు వేసిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్‌లో ధర్మమే గెలుస్తుంది

ఓటర్లు చైతన్యవంతులు: ఈటల


జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్ ఓటర్లు చైతన్యవంతులని, గజ్వేల్‌లో ధర్మమే గెలుస్తుందని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం జగదేవ్‌పూర్, అలిరాజ్‌పేట గ్రామాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ ప్రజలు చాలా చైతన్యవంతులని, ప్రతి ఒక్కరూ కథానాయకులై పనిచేశారని తెలిపారు. మూడో తేదీన గజ్వేల్ గడ్డపై బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జగదేవ్‌పూర్‌లో ఈటల కారు దిగగానే బీఆర్‌ఎస్ నాయకులు జై తెలంగాణ నినాదాలు చేయగా వారికి వ్యతిరేకంగా బీజేపీ నేతలు జై ఈటల అంటూ నినాదాలు చేశారు. ఇరువురిని పోలీసులు చెదరగొట్టారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ప్రసాద్‌రావు, సురేశ్, నాగరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని పోలింగ్ కేంద్రం వద్ద క్యూ లైన్‌లో నిల్చున్న ఓటర్లు



నారాయణఖేడ్: ర్యాకల్ గ్రామంలో బారులు తీరిన మహిళలు

ఈవీఎంలలో ఓటరు తీర్పు

ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద జనం పోటెత్తారు. ఉదయం నుంచే బారులుదీరారు. బరిలో నిలిచిన అభ్యర్థులు కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడంతో అధికారులు, నాయకులు ఊపిరిపీల్చుకున్నారు.



కోహెడలో తొలిసారి ఓటేసిన యువతి



సిద్దిపేట : చంటిబిడ్డతో ఓటేసేందుకు వచ్చిన మహిళ



దుబ్బాక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్యూలైన్‌లో నిలబడిన పురుషులు



చిన్నశంకరంపేటలో తొలిసారి ఓటేసిన యువ ఓటర్లు



వైద్యశిబిరంలో మంత్రి హరీశ్



జహీరాబాద్: అల్లీపూర్‌లో..



జిన్నారం: గడ్డపోతారంలో ఓటుహక్కును వినియోగించుకున్న అయ్యప్ప స్వాములు



సంగారెడ్డి : ఓటు వేసేందుకు వృద్ధుడిని వీల్ చైర్‌లో తీసుకొస్తున్న పోలింగ్ సిబ్బంది



దుద్దెడలో ఓటేసి సెల్ఫీ తీసుకుంటున్న దంపతులు



కోహెడలో ఓటు వేసిన యువతులు



చేర్యాల: వీల్ చైర్‌లో దివ్యాంగుడిని తీసుకొస్తున్న సిబ్బంది



ఓటర్ల వేలికి సిరా పెడుతున్న అధికారి



నంగునూరు : రాంపూర్‌లో పోలీసుల సహాయంతో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు



జిన్నారం: బొల్లారంలో ఓటు వేసేందుకు లైన్‌లో నిల్చున్న మహిళలు



సంగారెడ్డి : పోలింగ్ కేంద్రానికి తరలివస్తున్న వృద్ధురాళ్లు



సిద్దిపేట : వీల్‌చైర్ పై ఓటు వేసేందుకు తీసుకెళ్తున్న సిబ్బంది

ఈవీఎంల అడ్డగింత



అధికారికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

జగదేవపూర్(గజ్వేల్): కుకునూర్ పల్లి మండలం పీటీ వెంకటాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆర్ ఫొటో గుర్తు పక్కన ఇంకుతో మార్కింగ్ చేశారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఈవీఎంలను తరలింపును గురువారం రాత్రి అడ్డుకున్నారు. వాటిని చెక్ చేసిన తర్వాతనే తరలించాలని పట్టుబట్టారు. రాత్రి ఎనిమిదిన్నర వరకు పోలింగ్ కేంద్రాల్లోనే ఉంచారు. దీంతో ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బంది, పోలీసులు గ్రామానికి చేరుకుని ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో నాయకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించారు. సమస్య సద్దుమణగడంతో ఈవీఎంలను తరలించారు.

తొలి ఓటు సంబురం

- మొదటిసారి ఓటు ఉపయోగించుకున్న యువత
- నిజాయితీగా ఓటేయడం గర్వంగా ఉందంటున్న పౌరులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్యం విజయవంతం కావడంలో ఓటు హక్కు ఎంతో కీలకం. ముఖ్యంగా ఈ విషయంలో యువత బాధ్యతగా ఓటు వేయాల్సి ఉంటుంది. సిద్దిపేట జిల్లా పరిధిలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో 18 నుంచి 19 ఏళ్ల వయస్సు గల ఓటర్లు 28535 మంది ఉన్నారు. అత్యధికంగా గజ్వేల్‌లో 8844, హుస్నాబాద్‌లో 7293, సిద్దిపేట 6337, దుబ్బాకలో 6061 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 80 శాతానికి పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి సారి ఓటు వేసిన పలువురి అభిప్రాయాలు వారి మాటల్లో...



బాధ్యత పెంచింది



మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకోవడం గొప్ప అనుభూతి. కొంతవరకు రాజకీయాల గురించి తెలుసు. చట్టసభలకు ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఓటు వేసిన తర్వాత నాపై పౌరునిగా మరింత బాధ్యత పెరిగింది.

– వివేక్‌సాయిగౌడ్, చంద్లాపూర్, సిద్దిపేట

సంతృప్తినిచ్చింది



ఫస్ట్‌టైం ఓటు వేయడం ఆనందంగా ఉంది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన తీసుకురావాలి.

– గంద్యాడపు శ్రీహిత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, మాచాపూర్, సిద్దిపేట

సంతోషంగా ఉంది



మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకుని పరోక్షంగా పాలనలో భాగస్వాములం అయ్యామనే భావన బాగుంది. మంచి నాయకుడికే ఓటు వేశాను. భవిష్యత్‌లో కూడా తప్పకుండా ఓటువేస్తా.

–నంట భవానీరెడ్డి, కొండాపూర్, దుబ్బాక

నా బాధ్యతను నిర్వర్తించా..



మొదటి సారి ఓటు వేసి నా బాధ్యతను నిర్వర్తించాను. ఇక చట్టసభకు ఎన్నికైన నాయకులు ప్రజలకు సేవ చేయడం మరిచిపోకూడదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీ అందరికీ ఉపయోగపడే పథకాలు చేపట్టాలి.

– భూంపల్లి కార్తీక్‌రెడ్డి, రామ్‌నగర్, సిద్దిపేట

ధనిక, పేద తేడా లేనిది..



ధనిక, పేద, స్త్రీ, పురుష తదితర తేడాలు లేకుండా పొందే ఓటు హక్కును మొదటి సారి సక్రమంగా వినియోగించుకున్నాను. ఎన్నికైన నాయకులు సరిగా పనిచేయకుంటే అప్పటికప్పుడు తొలగించే అధికారం ఓటర్లకు కల్పించాలి. –బొలుమల్ల శివాని, కొహెడ, హుస్నాబాద్

మరిచిపోలేని అనుభూతి



మొదటి సారి ఓటు వేయడం మరిచిపోని అనుభూతి. బాగా ఆలోచించి పనిచేసే ప్రభుత్వానికి ఓటు వేశా. నిజాయితీ పరులైన నాయకులను ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు ద్వారానే కలుగుతుంది.

– దుద్దెడ అజయ్, తొగుట, దుబ్బాక

పౌరుడిగా నా బాధ్యత



ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా పూర్తిస్థాయి పౌరుడిగా నాపై మరింత బాధ్యత పెరిగింది. ప్రజాస్వామ్యంలో చట్టసభలకు ప్రతినిధులను ఎన్నుకోవడం మొదటి విధిగా భావిస్తున్న. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ఓటు వేశాను.

– పిట్ల సందీప్, నారాయణరావుపేట, సిద్దిపేట

మొదటి ఓటు వేయాలని ఎదురుచూశా..



కొల్చారం(నర్సాపూర్): మొదటి సారిగా ఓటు వేసేందుకు రెండేళ్లుగా ఎదురు చూస్తున్న. ఇప్పటికీ నా కల నెరవేరింది. యువతకు ఉపాధి కల్పించాలన్న నిర్ణయంతో ఏకీభవించే పార్టీకి ఓటు వేశా. ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి తెలియజేయాలి.

– కుమార్,చిన్న ఘనాపూర్, కొల్చారం మండలం

ఓటెయ్యడానికి వచ్చి.. గుండెపోటుతో మృతి



స్వామి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): బతుకు దెరువు కోసం వలస వెళ్లిన ఓ వ్యక్తి ఓటు వేడానికి సొంతూరుకు వచ్చి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన బాస స్వామి (52)కి ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తి లేదు. చాలా కాలం క్రితం బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ భార్య కళావతి, నలుగురు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇలా ఉండగా ఎన్నికల నేపథ్యంలో స్వామి తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. గురువారం ఓటేయడానికి పోలింగ్ స్టేషన్ వద్దకు వెళ్లాడు. ఆధార్ కార్డు, ఓటరు స్లిప్ తీసుకురాకపోవడంతో మళ్లీ ఇంటికి వెళ్లాడు. వాటిని తీసుకుని వస్తుండగా చాతిలో నొప్పిగా ఉందంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గ్రామస్తులు సపర్యలు చేస్తుండగానే స్వామి అక్కడికక్కడే తుది శ్వాస వదిలాడు. దీంతో మృతుడి కుటుంబంలో విషాదం నెలకొంది.

పోలింగ్ సరళిపై అభ్యర్థుల ఫిర్యాదు



పోలింగ్ కేంద్రం వద్ద వివిధ పార్టీల నాయకులు

సిద్దిపేటజోన్: స్థానిక శ్రీ చైతన్య స్కూల్ పోలింగ్ స్టేషన్(170)లో ఓటర్ల స్లిప్, వీవీ ప్యాట్ ల మధ్య లెక్క పొంతన లేదని ఆయా పార్టీల అభ్యర్థులు గురువారం రాత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలింగ్ సందర్భంగా 924 ఓటర్ల స్లిప్‌లకు గాను పోలింగ్ ప్రక్రియ అనంతరం వీవీ ప్యాట్‌లలో 920 మాత్రమే ఉన్నాయని ఏజెంట్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒక దశలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీల అభ్యర్థులు పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఎన్నికల అధికారులతో ఇదే విషయం పై చర్చించారు. సమస్య తీవ్రతరం కాకుండా పెద్ద ఎత్తున పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సమస్య గురించి అభ్యర్థులు పై అధికారులకు లేఖ రూపంలో ఫిర్యాదు చేయడంతో సద్దుమణిగింది

డబ్బు పంచిన వ్యక్తిపై కేసు

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో కొంత మంది ఓటర్లకు డబ్బులు పంచుతుండగా ఎఫ్ఎస్‌టీ టీం పట్టుకుంది. సమాచారం అందుకున్న సీఐ కృష్ణ అక్కడికి చేరుకుని డబ్బు పంచుతున్న వేణుగోపాల్ రెడ్డిని అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ.88వేల నగదే స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి యాదవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.